క్లుప్తంగా

బాట సుంకులమ్మకు ప్రత్యేక పూజలు

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామ సమీపంలో వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాంమోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాలలో రైతు సంఘం ఆధ్వర్యంలో మూడురోజులపాటు బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం విశేష పూజల అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయి ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న డాక్టర్ రామిరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక స్వామినగర్‌కు చెందిన పేద కుటుంబాలకు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. కాలనీకి చెందిన మద్దమ్మ, మారెన్న కుమార్తె మంజుల, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి కుమార్తె సంపూర్ణ వివాహాలకు తనవంతు సాయంగా రూ. 5 వేల చొప్పున రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి సేవా సమితి సభ్యులు సరోజ, సుబ్రహ్మణ్యం, ఓబులేసు, భాస్కర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

విజయ డెయిరీ పాల బోనస్ పంపిణీ

బనగానపల్లెరూరల్: విజయ డెయిరీ బనగానపల్లె యూనిట్ పరిధిలోని జ్వాలాపురంలో 33 మంది పాడి రైతులకు రూ.77,890 డెయిరీ మేనేజర్ మధుసూదన్‌బాబు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విజయడెయిరీకి పాలపోసే వారికి లీటర్‌కు రూ.2ల ప్రకారం సంస్థ బోనస్‌ను మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏజెంట్లు తిరుపతయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి సతీమణి శైలజ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వైద్యులు డాక్టర్లు రవి, హిమబిందు రోగులకు కంటి పరీక్షలు చేశారు. 40 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. 20మందికి అత్యవసరంగా కంటి ఆపరేషన్ నిర్వహించాల్సి రావడంతో వారిని ప్రొద్దుటూరుకు తీసుకెళ్లారు. వైద్యశిబిరానికి వచ్చి వారికి రామ్మోహన్‌రెడ్డి భోజన వసతి కల్పించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్: స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఐదవ ప్లాట్‌ఫారం పక్కన శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసుల సమాచారం విన్నపం మేరకు ఆ శవానికి ద్రోణాచలం ఆత్మబంధువు సభ్యులు ఆదివారం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేసి ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, రోటరీ క్లబ్ సభ్యుడు రాజయ్యగౌడ్‌కు కానిస్టేబుల్ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మబంధువు సభ్యులు షాధిఖాన రాజు, పానిపూరి మురళీ, తాహెర్ బాషా, ఆటో సుధాకర్, ఫొటోగ్రాఫర్ బాబా పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీ వంద శాతం పూర్తి చేయాలి

ప్యాపిలి: నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన ప్యాపిలి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఈ నెల 14 వ తేదీన 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కోసం క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు.

పిల్లల క్షేమం కోరేది తల్లిదండ్రులే

డోన్ టౌన్: సమాజంలో తమ పిల్లల క్షేమాన్ని కోరుకునే వారిలో తల్లిదండ్రుల తరువాతనే మిగిలిన వారందరు ఉంటారని ప్రిన్స్‌పాల్ గీత అన్నారు. పట్టణ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో ఆదివారం కన్నవారి దీవెన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల కృషి, కష్టాన్ని మరువ కూడదన్నారు. వారి కృషికి తగ్గ ఫలితం మీరు ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడు లభిస్తుందన్నారు. అనంతరం పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థినులు తల్లులకు పిల్లలు పాదాభివందనం చేయగా మాతృమూర్తులు దీవెనలు అందించారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న!

- సిరులు కురిపిస్తున్న దిగుబడులు
- సాధారణ విస్తీర్ణం 11,607 ఎకరాలు.... 47,675 ఎకరాల్లో సాగు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



కల్లాల వద్ద మొక్కజొన్న పంటను ఆరబోసిన దృశ్యం

బనగానపల్లె: మొక్కజొన్న సిరులు కురిపిస్తుంది. గతంలో ఎన్నడులేని విధంగా ఖరీఫ్, రబీ సీజన్‌లలో మొక్కజొన్న పంట సాగు రైతులకు కలిసివచ్చింది. ఖరీఫ్‌లో ఎకరానికి 25–30 క్వింటాళ్ల దిగుబడి లభించి క్వింటాం రూ.1900 నుంచి 2 వేలు చొప్పున గిట్టుబాటు ధర లభించిన విషయం తెలిసిందే. దీంతో రబీలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా సాధారణ విస్తీర్ణం 11,607 ఎకరాలు ఉండగా ఊహించని విధంగా 47,675 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. దిగుబడలూ ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి 30–35 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గిట్టుబాటు ధర కూడా రూ.2 నుంచి రూ. 2,200 వరకు ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు లాభాలు పండించడంతో రబీలో రికార్డు స్థాయిలో సాగైంది. ఏ మాత్రం సాగు చేయని మండలాల్లోనూ విస్తారంగా సాగు చేశారు రైతులు. వాస్తవానికి రుద్రవరం, సంజామల, పగిడాల, డోన్ మండలాల్లో రబీలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం జీరో. అయితే రుద్రవరం మండలంలో 4,523 ఎకరాలు, పగిడాల – 1,490, సంజామల – 1,073, డోన్ – 229 ఎకరాల్లో ఈ పంటనుసాగు చేశారు. జిల్లాలో అత్యధికంగా బనగానపల్లె మండలంలో 5,661 ఎకరాలు, ఆళ్లగడ్డ – 4,822, అవుకు – 3,048, మిడుతురు – 2,759, జూపాడుబంగ్లా – 2,804, చాగలమర్రి – 2,111, గడివేముల – 1,830, వెలుగోడు– 1,589 ఎకరాల్లో సాగు అయ్యింది. ఈ మేరకు రెండువారాల నుంచి కోతలు మొదలయ్యాయి.

పెట్టుబడులు తక్కువ... ఆదాయం ఎక్కువ

మొక్కజొన్న సాగులో పెట్టుబడులు తక్కువగా ఉండడంతో ఆదాయం ఎక్కువగా వస్తుంది. దుక్కిసేద్యాలు, కలుపు మొక్కలు తీయడం, రసాయన క్రిమిసంహారక మందులు, విత్తనాలు ఇతర పెట్టుబడులు ఎకరానికి రూ.20 వేలకు మించడం లేదు. ప్రస్తుతం ఉన్న గిట్టుబాట ధర మేరకు ఎకరానికి రూ.60–70వేలు లభించడంతో పెట్టుబడి పోను రూ.40 వేల వరకు లాభం ఉంటుందని రైతులు అంటున్నారు. ఎస్సార్‌బీసీ, కేసీ కెనాల్, తెలుగుగంగ తదితరాల సాగు నీటి వనరుల సౌకర్యం కూడా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడానికి ఓ కారణం అంటున్నారు రైతులు. మార్కెట్‌లో మొక్కజొన్న దిగుబడలకు ఈ సంవత్సరం మంచి డిమాండ్ ఉన్నందున వ్యాపారులు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. ఇతర పంటల కొనుగోలు సమయంలో వ్యాపారులు బస్తాపై మూడు కిలోలు [illegible] పంటకు మాత్రం రెం[illegible]



కంకులతో కళకళలాడుతున్న మొక్కజొన్న

గిట్టుబాటు బాగుంది



[illegible]న్న సాగు చేశా. ఎకరానికి 30–35 క్వింటాళ్లదిగుబడి లభిస్తుంది. ప్రస్తుతం గిట్టుబాటు ధర క్వింటాం రూ.2వేల వరకు ఉంది. ఎకరానికి పెట్టుబడి రూ.20 వేలు కాగా రూ.40వేలు మిగులు ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, రైతు కాపులపల్లి, బనగానపల్లె మండలం

అనుకూలించిన వాతావరణం



ఈ సంవత్సరం మొక్కజొన్న పంటకు వాతావరణం అనుకూలించింది. మూడెకరాల్లో సాగు చేయగా దాదాపు 90 క్వింటాళ్లకుపైగాదిగుబడి వచ్చే అవకాశం ఉంది. పెట్టుబడులు చాలా తక్కువ. మొక్కజొన్న సాగు లాభసాటిగా ఉంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు మిట్టపల్లి, బనగానపల్లె మండలం

రైతులకు కలిసివచ్చిన పంట



గతంలో ఈ పంట ద్వారా రైతులకు గిట్టుబాటుగా ఉండేదికాదు. ఈ సంవత్సరం విత్తనం వేసినప్పటి నుంచి కోతల వరకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. గిట్టుబాటు ధర బాగున్నందున రైతులకు మిగులుగా ఉంటుంది.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె మండలం

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామ సుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడా ల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరి వరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి

బేతంచెర్ల: మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ పనిచేస్తోందని వీహెచ్‌పీ దక్షిణ ఆంధ్ర ఉపాధ్యక్షుడు వ్యాసరాజు అన్నా రు. ఆదివారం పట్టణంలోని పారిశ్రామిక వేత్తలు బుగ్గన సంజీవరెడ్డి, గుండా గోపాలు, శేషఫణి, పుల్లారెడ్డి, గుండా జగన్ మోహన్ రావు ధర్మరక్ష నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పని చేస్తున్న విశ్వ హిందూ పరిషత్ సంస్థకు ధర్మ రక్షా నిధిని అందించడం భారతీయుని బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యాక్షుడు బుగ్గన చంద్రమౌలీశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుగ్గన మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు

బేతంచెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చామన్నారు. పట్ట భద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

మన వార్డు.. మన బాధ్యత !

- నీటి సమస్య పరిష్కారంలో కౌన్సిలర్లు
- స్వయంగా బిందెలకు అందిస్తున్న వైనం



మాదన్న నగర్‌లో ట్యాంకర్ నుంచి బిందెలకు నీటిని పడుతున్న కౌన్సిలర్ పాలుట్ల రఘురాం మీనాక్షి

డోన్ టౌన్: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారికి ఎదురయ్యే సమస్యను సత్వరమే పరిష్కరించి సౌకర్యాలను కలుగజెయ్యాలనే మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా డోన్ మున్సిపల్ కౌన్సిలర్లు ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా మన వార్డు మన బాధ్యత ప్రోగ్రాంలో చురుక్కుగా పాల్గొని సమస్యను సత్వరమే పరిష్కరించడమే కాకుండా వద్ద ఉండి పనలను పర్యవేక్షణ చేస్తున్నారు. పట్టణానికి ప్రధాన నీటి వనరు గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న ఫిల్టర్ హౌస్ నుంచి వచ్చే పైపు లైన్ జాతీయ రహదారి 44 దాటుకొని పట్టణంలోనికి కంభాలపాడు సర్కిల్, వైఎస్ నగర్, కోట్ల సుజాతమ్మ నగర్ కాలనీల మీదుగా పట్టణంలోనికి నీటి సరఫరాను చేస్తున్నారు. అయితే జాతీయ రహదారి కింద మరమత్తలకు గురైతే ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఆదేశాలతో సిబ్బంది మరమత్తులు చేయాల్సి ఉంది. ఇక్కడ జరుగుతున్న జాప్యం కారణంగా నీటి సరఫరాకు ఏర్పడిన అంతరాయం విషయాన్ని మంత్రి బుగ్గన దృష్టికి మున్సిపల్ పాలకపక్షం తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి నూతన పైపు లైను వేయిస్తున్నారు. ఈ పనుల కారణంగా గత వారం రోజులుగా పట్టణంలోని తారకరామనగర్, ఇందిరా నగర్, వైఎస్, కోట్ల, భాస్కర్‌రెడ్డి, సుజాతమ్మ, శ్రీనివాస నగర్, మాదన్ననగర్, డేవిడ్ నగర్ తదితర కాలనీల్లో నీటి సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని గమనించిన ఆయా వార్డు కౌన్సిలర్లు నీటి సమస్యను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్ల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా ట్రాక్టరు ద్వార ఆయా కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల వద్ద ప్రజలు గుమి కూడి ఇబ్బందులు పడకుండా స్వయంగా మహిళా కౌన్సిలర్లు నీటిని బిందెలకు పట్టి ఇస్తున్నారు. అంతే కాకుండ ఆయా కాలనీల్లో సొంత బోర్లు కలిగిన ఇంటి యజమానులను సంప్రదించి నీటికి ఇరుగు పొరుగు వారికి అందిస్తున్నారు. అదేవిధంగా మన వార్డు మన బాధ్యత ప్రోగ్రాం కింద కాలనీల్లో వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదతర పనులను కౌన్సిలర్లు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల అధికారి, ఆర్డీఓ వెంకటరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ : డోన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల అధికారి, ఆర్డీఓ వెంకటరెడ్డి పర్యవేక్షించారు. ఈ మేరకు ఆదివారం పోలింగ్ కేంద్రాలకు అధికారుల కేటాయింపు తదితరాలను ఆయన పర్యవేక్షించారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గంలోని మొత్తం 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇందులో పట్టభద్రులకు 15, టీచర్ల కోసం 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి వెంకటరెడ్డి తెలిపారు. రెవెన్యూ డివిజ న్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు 949, పట్టభద్రులు 13072 మంది ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసిడింగ్ ఆఫీసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొసిడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ అధికారులు, కానిస్టేబుళ్లు, మైక్రో అబ్జర్వర్లు మొత్తం 8 మందిని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఓటు హక్కు కలిగినవారు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

కొలిమిగుండ్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1021, ఉపాధ్యాయ ఓటర్లు 66 మంది ఉన్నారు.

బనగానపల్లెరూరల్: బనగానపల్లె మండలంలో సోమవారం జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సువర్ణమ్మ, మండల డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో మొత్తం ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు.

144 సెక్షన్ అమలు

ప్యాపిలి: ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ శ్రీరాములు, ఎస్ఐ సీఎం రాకేశ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అవుకు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ,ఉపాధ్యాయ ఎన్నికలకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని సెక్టోరల్ ఆఫీసర్ ఉమాకాంత్ రెడ్డి పేర్కొన్నారు. అవుకు పట్టణంలోని బీసీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రానికి ఆదివారం సాయంత్రం ఎలక్షన్ సిబ్బందితో పాటు బ్యాలెట్ బాక్స్‌లు వచ్చాయి. ఈసందర్భంగా సెక్టోరల్ ఆఫీసర్ మాట్లాడుతూ అవుకు మండలంలో 1097 మంది ఉన్న పట్టభద్రుల ఓటర్లు 353 నంబరు గల బూత్‌లో, 54 మంది ఉన్న ఉపాధ్యాయ ఓటర్లు 158 నంబరు బూత్‌లో ఓట్లు వేయాలన్నారు.

ఏర్పాట్లు పూర్తి

కోవెలకుంట్ల: పశ్చిమ రాయలసీమ(ఉమ్మడి కర్నూలు, అనంతపురం వైఎస్సార్ జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సోమవారం పోలింగ్ జరుగనుండటంతో కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. కోవెలకుంట్ల మండలంలో 1,685 మంది పట్టభద్రులు, 200 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ మేరకు స్థానిక మెయిన్‌స్కూల్‌లో రెండు, స్పెషల్ స్కూల్‌లో ఒకటి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే సంజామల మండలంలో 1,022 మంది పట్టభద్రులు, 47 మంది ఉపాధ్యాయులు ఓటు వేయాల్సి ఉండగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐలు వెంకటరెడ్డి, ప్రతాప్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

డోన్ రూరల్ : స్థానిక పాతపేటకు చెందిన కృష్ణమూర్తి అనే వ్యక్తిపై ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కత్తితో దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణమూర్తిని అదే కాలనికి చెందిన బాలు అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరడచడం జరిగిందన్నారు. స్థానికులు కృష్ణమూర్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన డాక్టర్‌లు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ప్రజా సంక్షేమ, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన
- బీసీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత
- మహిళలకు రాజకీయ ప్రోత్సాహం
- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, ఆ దిశగా ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఎక్కువ సామాజిక వర్గాలు ఉన్న బీసీ అభివృద్ధికి సీఎం ప్రాధాన్యతనిస్తున్నారని, ప్రత్యేకించి మహిళలకు అధిక ప్రాధాన్యనిస్తూ రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆనందోత్సవాల మధ్య ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ పండెండేళ్ల కిందట ఒకే ఒక అడుగుతో మొదలైన జగనన్న ప్రస్థానం నేడు కోట్లమంది అభిమానులు కలిగిన ఏకైక నాయకుడు అయ్యారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన 45 నెలల కాలంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేసి విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించగా 2010 ఏప్రిల్ 9న వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర ప్రారంభించారని గుర్తు చేశారు. ఆపివేయాలని కాంగ్రెస్ అధిష్టానం వైఎస్ జగన్‌ను ఆదేశించినా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఓదార్పు యాత్ర కొనసాగించారన్నారు. వెన్నుపోటు, కుట్ర రాజకీయాలు జగన్‌కు తెలియవన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరాలనుకుంటే నాయకులు ఆ పార్టీ నుంచి సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి రావాలని షరత్తు విధించిన ఏకైక నేత జగనన్న అని అన్నారు. ఈ మేరకు 19 ఎమ్మెల్యేలు, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ పదవులకు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయాన్ని కాటసాని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా బరిలోదిగి 67 స్థానాలు గెలుచుకొని బలమైన ప్రతిపాక్షంగా అవతరించగా అధికారంలో ఉన్న టీడీపీ కుట్ర ప్రలోభాలతో 23 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో దేశ చరిత్రలోనే 50శాతానికిపైగా ఓట్లతో 151 శాసన సభ, 22 ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. తొలి మంత్రివర్గంలోనే 56 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఇవ్వడమేకాక ఐదు మంది డిప్యూటీ సీఎంలలో నాలుగు పదవులు కేటాయించారన్నారు. 2022 ఏప్రిల్ 11న మంత్రివర్గంలో ఏకంగా 70శాతం పదవులు ఆ వర్గాలకు కేటాయించి సీఎం జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. అదేవిధంగా దేశ చరిత్రలో ఎక్కడలేని విధంగా నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు కేటాయించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రాజ్యాసభ స్థానిక సంస్థల పదవుల్లోనూ బీసీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు అబ్దుల్‌ఫైజ్, అంబటి రవికుమార్‌రెడ్డి, నీలిశ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, మహబూబ్‌వలి, ఎవరెస్టు బాబు, సురేష్, ఈసారి యల్లయ్య, దేవుడు, తిరుపాల్‌గౌడ్, ప్రిన్స్ టైలర్ బాషా, రవి, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, గౌస్‌పీరా, పెద్దన్న, అమీర్, గోరేసా, విజయ్‌గౌడ్, నరసయ్య, షాఖీర్, కృష్ణ, మహేష్, వెంకటేశ్వర్లు, రోటో, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అవుకు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ అవుకు పట్టణంలోని చల్లా కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పండ్లు పంపిణీ చేశారు. అలాగే అవుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనాయకుడు చల్లా చరణ్, నాయకులు, కార్యకర్తలు, చల్లా అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పిస్తున్న చల్లా శ్రీలక్ష్మీ



దివంగత వైఎస్‌ఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం చరిత్రాత్మక అవసరం

డోన్: రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన విధానం మెరుగు పడేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించడం 12ఏళ్ల క్రితం చరిత్రాత్మకవసరం అని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లు ఎదుర్కొని నిలిచిన వైఎస్సార్‌సీపీ



మహిళా ఎంపీటీసీ సభ్యులతో కలిసి కేట్ కటింగ్ చేయిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల మధ్య మహిళా ఎంపీటీసీ సభ్యులతో జెడ్పీ చైర్మన్ భారీ కేక్‌ను కట్ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతి చెందాక నల్లకాల్వ సభలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగనన్న ఓదార్పు యాత్ర చేపట్టారన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నా రాజీనామా చేసి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం యాత్ర చేశారని తెలిపారు. 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలు, 22 ఎంపీ సీట్లు సాధించి ఎంతో ఎత్తుకు పార్టీ చేరుకుందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాలు దక్కించుకోవడం చరిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, హనుమంతుగుండం సొసైటీ అధ్యక్షుడు మాల ఈశ్వరరెడ్డి, తోళ్లమడుగు సర్పంచ్ మొలక రాజారెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్ణారెడ్డి, దస్తగిరి, మమేశ్వర రెడ్డి, శివశంకరరెడ్డి, లక్ష్మిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగరాజు, బాసు తదితరులు పాల్గొన్నారు.

షియా మతస్తుల శ్మశానవాటికలో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు తనయుడు ఓబులరెడ్డిని సన్మానిస్తున్న షియామతస్తులు

బనగానపల్లె: పట్టణంలోని తపాలా కార్యాలయం వెనుక ఉన్న షియామతస్తుల శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో షీయా మతస్తులు పలువురు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు ఆయన కుమారుడు కాటసాని ఓబులరెడ్డిని కలిసి సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో షియామతస్తులు మాట్లాడుతూ శ్మశానవాటికలో నీటి సమస్యతో పాటు ప్రహరీ తదతర సమస్యలను కాటసాని ఓబులరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. శ్మశానవాటిను పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సాయం మరువమని, ఆయన గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో షీయా యూత్ కమిటీ సభ్యులు ఆస్థాన రిజ్వాన్ అబ్బాస్ హుస్సేన్, ఎవరెస్టు సాజిద్‌హుస్సేన్, ఇక్తార్‌హుస్సేన్, ఆత్తార్ ఖాలీల్‌హుస్సేన్, వాజీద్, దాదాబాషా, గోరేలాల్, సమీర్, సజ్జాద్, జహీర్‌హుస్సేన్ ముజాహిద్ అబ్బాస్‌హుస్సేన్, అలాందర్‌హుస్సేన్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.